

చాలా ఏళ్ళ తర్వాత పుట్టిన ప్రాంతానికి వెళ్తున్నందుకు నాకు ఎంతో ఆనందంగా ఉంది. మనసులో ఏదో చెప్పలేని ఉత్సాహం ఉరకలేస్తూ ఉంది. వారం రోజుల నుండే మనసు అనంతపురం వైపు చూస్తూ ప్రయాణానికి సిద్ధపడ సాగింది.

ఎంత పేదదయినా, ఎన్ని ఒడిదుడుకులున్నా జన్మనిచ్చిన ప్రాంతాన్నీ, ఆ వాతావరణాన్నీ, ఆ గాలినీ, ఆ నీళ్ళనూ, ఆ మనుషుల్నీ చాలా కాలం ఎడబాటు తర్వాత కలుసుకుంటున్నప్పుడు మనసు పొందే ఉద్విగ్నత మాటలకందనిదేమో!

ఈసారి ఎలాగయినా భార్యాపిల్లలతో పాటే బయలుదేరాలనుకున్నాను. కానీ, తీరా బయలుదేరే ముందుగా కాలేజీలో ఇంజనీరింగ్ చదువుతున్న పిల్లలకు టెర్మినల్ పరీక్షలు ప్రకటించడంతో వాళ్ళే వరూ నాతో పాటు బయలుదేరడానికి వీలుగాక పోయింది. కమలయితే బాగా నిరాశపడింది. వాళ్ళ అవ్వాతాతల్ని చూడాలనుకున్న పిల్లల ఉత్సాహం కూడా ఒక్కసారిగా చప్పబడిపోయింది. వాళ్ళందరికీ నచ్చజెప్పి నేనొక్కణ్ణే అనంతపురానికి బయలుదేరాను.

ఒకటో తరగతి నుండీ ఎమ్మెస్సీ వరకూ ఒకే బెంచీలో కూర్చొని నా మనసులో మనసై, మాటలో మాటై కలిసి చదువుకున్న స్నేహితుడు రామ్మూర్తి. వాడు నాకు విడదీయరాని స్నేహితుడే కాదు, దగ్గరి బంధువు కూడా. అటువంటి ఆత్మ బంధువు అదేపనిగా అనంతపురం నుండి వెతు క్కుంటూ మచిలీపట్నం వచ్చి తన కూతురు పెళ్ళికి రమ్మని ఆహ్వానించినప్పుడు నేను వెళ్ళకుండా ఉండడం బాగుండదనుకున్నాను. అందుకే ఉద్యోగ విషయకంగా ఎంత ఒత్తిడి ఉన్నా, పిల్లలకు పరీక్ష లని తెలిసినా బయలుదేరవలసి వచ్చింది.

ఉదయమే మచిలీపట్నం నుండి బస్సులో బయలుదేరి వస్తున్నాను. రోడ్డుకు ఇరు వైపులా ఎక్కడ చూసినా పచ్చని పొలాలు కళకళలాడుతున్నాయి. ఎటువైపు చూసినా కాలువల్లో నుంచి, తూముల ద్వారా పిల్ల కాలువల్లోకి నీళ్ళు గలగల పారుతున్నాయి. గువ్వ కూర్చోడానికి కూడా స్థలం లేకుండా మొత్తం కనుచూపు మేరా వరి పొలాలే. పదారేళ్ళ పడుచు పిల్లల్లాగా పైరు మొక్కలు పిల్లగాలి తాకిడితో ఒయ్యారాలు పోతున్నాయి. అడుగడుగునా రోడ్డు దాకా వచ్చిన పల్లెలు చిన్నపాటి పట్నాల లాగా మిలమిలలాడుతున్నాయి.

ఆఫీసు పని మీద ఈ ఇరవయ్యేళ్ళ కాలంలో కొన్ని వందల సార్లు మచిలీపట్నం నుంచి విజయవాడకు వెళ్ళి వచ్చాను. ప్రతిసారీ ఆ పచ్చని పొలాలనూ, ఆ సుభిక్షమయిన గ్రామాలనూ చూసి నా మనసు పరవశిస్తూనే ఉంది. అట్లాగే ప్రతిసారీ ఆ పచ్చని జీవితంతో నా పుట్టిన ప్రాంతంలోని ఎడారిమయ జీవితాన్నీ, మోడువారిన పల్లెల్నీ సరిపోల్చుకుంటూ అంతులేని వేదనకు గురి అవుతూనే ఉంది. 'నేను పుట్టిన ప్రాంతంలోనూ ఇటువంటి నీటి సౌకర్యం ఉంటే మా జీవనగతులు మరొకవిధంగా ఉండేవి కదా' అని బాధపడుతూనే ఉంది.

చాలా మంది అనుకుంటున్నట్లు ఆ ప్రాంతీయులు అదృష్టవంతులు కావచ్చునేమో గానీ, నా ప్రాంత ప్రజలు మాత్రం అన్ని విధాలా దోపిడీకి గురైన వాళ్ళని నేనెప్పుడూ అనుకుంటూ ఉంటాను. ఇప్పుడూ అలాగే అనుకుంటూ విజయవాడ చేరుకున్నాను. సాయంకాలం వరకూ చిన్న చిన్న పనులు చూసు కొని, చాలా ఏళ్ళ తర్వాత ఊరెళుతున్న కారణంగా ప్రయాణాన్నంతా మనసులో నిర్ణయించుకొని, తమ్ముని పిల్లలకు కావలసినవన్నీ తీసుకొని అనంతపురం బస్సెక్కాను.

బస్సు బయలుదేరిన పావుగంట లోపలే ఊరి పొలిమేరలు దాటి వేగం పుంజుకుంది. పొలాల్లో నుంచి తేలి వస్తున్న గాలి శరీరాన్ని చల్లగా తాకుతూ ఉంది. రకరకాల పైర్ల వాసనా, గడ్డి వాసనా మనసును పరవశింపజేస్తున్నాయి. చిన్నతనంలో పొలాల్లో తిరిగినప్పటి అనుభూతిని గుర్తుకు తెస్తున్నాయి. గతం గుర్తుకు రాగానే ఏదో జీవితంలో పోగొట్టుకున్నట్లూ, ఏదో ఒక అసహజత్వంలో కూరుకుపోయినట్లూ అనిపించసాగింది. కాసేపు నన్ను నేను తర్కించుకున్నాను.

నిజంగా, పల్లెపట్టుల నుంచి చదువుకొని వచ్చి దూరదూర పట్టణాలలో రకరకాల బతుకు మార్గాలలో జీవిస్తున్న వాళ్ళు అసహజమైన జీవితం గడుపుతున్నట్లేనా? పుట్టిన పల్లెల మీదున్న మమ కారంతో ఆ వాతావరణాన్నీ, ఆ జీవితాన్నీ ప్రేమిస్తూ అక్కడ గడిపే జీవితంలో మాత్రమే సహజత్వం ఉందా? ఎక్కడి వాళ్ళక్కడి జీవితాన్ని ప్రేమించు కుంటూ బతికితే అభివృద్ధి అనిపించుకుంటుందా? చదువులనేవి ఉద్యోగాల కోసం మాత్రమే కాదనే సంగతి వాస్తవమయినా, గ్రామీణ జీవన విధానాన్ని కాపాడ్డం కోసం గ్రామాలలో పుట్టిన వాళ్ళందరూ అక్కడే నిరంతరం పనిచేయాలా?

పుట్టిన ప్రాంతానికి దూరమై ఒక విధమయిన యాంత్రిక జీవనమార్గంలో పడిపోయానని బాధపడు తున్న నాకు నేను వేసుకున్న ప్రశ్నలు తృప్తినివ్వ లేదు. దాదాపు ఇరవై సంవత్సరాల నుండి ఈ ప్రశ్నలు వేసుకుంటూనే ఉన్నాను. ఈ ప్రశ్నలకు సమాధానం, నేను మళ్ళీ మా పల్లెకు పోవడమే. అయితే, అది సాధ్యపడ లేదు.

ఇరవై ఏళ్ళ కిందట నా చదువుకు తగిన ఉద్యోగం ఒక మంచి కంపెనీలో దొరకడంతో పుట్టి పెరిగిన ప్రాంతం వదిలి మచిలీపట్నం చేరవలసి వచ్చింది. అప్పటి నుండి గ్రామీణ జీవితంతో నాకున్న సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. ఉద్యోగం కారణంగా అప్పుడప్పుడు వెళ్ళిరావడానికి కూడా అవకాశం తగ్గిపోయింది. దానికి తోడు చాలా దూరాభారం, ఖర్చుతో కూడుకున్న పని, పిల్లల చదువులు, మనిషిలో సహజంగా ఉన్న బద్ధకం, అన్నిటి కంటే ముఖ్యమయింది- పుట్టిన పల్లెలో మాకు పెద్దగా ఆస్తిపాస్తులు లేకపోవడం- ఇలా ఎన్నో కారణాలు. అందుకే ఇరవై ఏళ్ళ కాలంలో పెద్ద చెల్లెలి కొడుకు పెళ్ళికి ఒకసారీ, రెండో చెల్లెలి కూతురు పెళ్ళికి ఒకసారీ మొత్తం రెండుసార్లు మాత్రమే మా ఊరెళ్ళి వచ్చాను. ఇది మూడోసారి ప్రయాణం.

ఆలోచిస్తూ నిద్రలోకి జారుకున్నాను. మధ్య మధ్యలో మేలుకుంటూ మళ్ళీ బలవంతంగా

# ఈ సంఘర్షణ ఎన్నాళ్ళీ?



నిద్రలోకి పోతూ కళ్ళు తెరిచి చూసేసరికి తెల్లవారింది. కిటికీలో నుంచి బయటికి తొంగి చూశాను. బస్సు తాడిపత్రి పరిసరాల్లోకి వచ్చినట్లు అర్థమయింది. ఒకటీ అరా తప్ప పొలాలన్నీ బీడుగా కనిపిస్తున్నాయి. పొలాల్లో కనిపిస్తున్న తేమనూ, రోడ్డు పక్కన గుంతల్లో నిలిచిన నీళ్ళనూ చూసి వర్షం బాగానే పడినట్లు అనిపించింది. మరి పంటలెందుకు పెట్టుకోలేదో నాకర్థం కాలేదు. పక్కనున్న మనిషిని అడిగాను. "అదును దప్పిన వాన, ఏం లాభం నాయనా" అంటూ అతడు బరువుగా నిట్టూర్చాడు. ఆ నిట్టూర్పు అతడు రైతనే విషయాన్నీ, ఆ రైతు వేదననూ పట్టిచ్చింది.

బస్సు తాడిపత్రి పరిసరాల్లోకి చేరుకుంది. రోడ్డుకు ఇరు వైపులా కనుచూపు మేరవరకూ చిన్న చిన్న ఫ్యాక్టరీలు కనిపిస్తున్నాయి. అవన్నీ పాలిష్ బండల ఫ్యాక్టరీలని అర్థం చేసుకోడానికి నాకు ఎక్కువ సేపు పట్టలేదు. తాడిపత్రి చుట్టుపక్కలున్న ముప్పై నలభై పల్లెలకు జీవనోపాధి కల్పిస్తున్న పాలిష్ బండల ఫ్యాక్టరీలు ఆ ప్రాంతంలో దాదాపు వెయ్యి వరకూ ఉన్నాయని పక్కనున్న మనిషి చెప్పినప్పుడు నేను నమ్మలేకపోయాను. ఇంతకుముందు చెల్లెలి కూతురు పెళ్ళికి వచ్చినప్పుడు డోన్ గుండా రైల్లో రావడం వల్ల ఈ పాలిష్ బండల ఫ్యాక్టరీలను నేను చూడలేదు. అంతకు ముందు వేళ్ళ మీద లెక్కించదగినన్ని మాత్రమే ఉండేవి. నా పక్కనున్న మనిషి ఇంకా చెబుతూ ఆ ప్రాంతంలో మొత్తం వ్యవసాయమంతా బీడు పడిందని, అందువల్లనే ఆ పల్లెలు సుభిక్షంగా ఉన్నాయని చెప్పడం విని ఆశ్చర్యపోయాను. అతని మాటల్లోని వ్యవసాయ వ్యతిరేకత నాకర్థమయింది.

కిటికీలో నుంచి తొంగి చూస్తున్నాను. కొన్ని ఫ్యాక్టరీలు ఎకరా విస్తీర్ణంలోనూ, మరి కొన్ని రెండు మూడెకరాల విస్తీర్ణంలోనూ వ్యాపించి ఉన్నాయి. ప్రతి ఫ్యాక్టరీ కాంపౌండులోనూ పదీపదైదు సంసారాలున్నట్లూ, ఇరవై ముప్పై మంది పని చేస్తున్నట్లూ కనిపించింది. రకరకాల సైజుల్లో పాలిష్ చేసిన బండలు వరుసలు తీర్చి అందంగా నిల బెట్టారు. వాటి కోసం వందలాది లారీలు బారులు తీరి ఉన్నాయి. వేస్ట్ మెటీరియల్ పొలాల నిండా గుట్టలు గుట్టలుగా పోసి ఉంది. దాని మీద పిచ్చిమొక్కలు దట్టంగా పరుచుకున్నాయి.

సారవంతమయిన నల్లరేగడి భూములన్నీ ఆహార ధాన్యాన్ని కాకుండా నల్లబండల్ని పండిస్తూ ఉండడం నాకయితే బాధనిపించింది. అవన్నీ కూడా ఎక్కువగా పట్టణాల పెరుగుదలకేనన్నది నన్ను మరింత బాధపెట్టింది.

బస్సు బస్టాండుకొచ్చింది. ఇరవై ఏళ్ళ కిందట టౌను మధ్యలో ఉన్న బస్టాండు ఇప్పుడు దాదాపు రెండు కిలోమీటర్ల వెలుపల నిర్మించబడింది. దాని తర్వాత మరో మైలు దూరం వరకూ టౌను పెరిగినట్లుంది. అంతా గమనిస్తూ ఆలోచిస్తుండగనే బస్సు బస్టాండు నుండి అనంతపురం బయలుదేరింది.

పల్లెలు ఒకదాని తర్వాత ఒకటి కనిపించి కనుమరుగవుతున్నాయి. తాడిపత్రికి దగ్గర్లో ఉన్న పల్లెలు కళకళగా ఉండడం, తర్వాతవి బోసిపోయి ఉండడం గమనించాను. అందుకు కారణాలేమిటో ఆలోచిస్తున్నాను. అంతలోనే మా ఊరి పొలిమేర లొచ్చాయి. వాటిని చూడగానే ఒక్కసారిగా మనసంతా ఉద్విగ్నతకు లోనయింది.

మెట్ట పొలాలన్నీ కంపచెట్లతో నిండి ఉన్నాయి. చుక్కాయపేట నుండి మా బండ్లపల్లి వరకూ రెండు మైళ్ళ పొడవునా రోడ్డుకిరువైపులా ఒకప్పుడు గుబురుగా ఉన్న జువ్వీ, చింతా, వేప చెట్లన్నీ మటు మాయమయ్యాయి. రోడ్డుకు దక్షిణం వైపున్న దేవర కొండను చూడగానే శరీరం పులకరించింది.

> కిటికీలో నుంచి తొంగి చూస్తున్నాను. కొన్ని ఫ్యాక్టరీలు ఎకరా విస్తీర్ణంలోనూ, మరి కొన్ని రెండు మూడెకరాల విస్తీర్ణంలోనూ వ్యాపించి ఉన్నాయి.

చిన్నప్పుడు ఆ కొండదడిలో గడ్డి కోసుకుంటూ కలీపండ్ల కోసం, పులీపండ్ల కోసం, బలును పండ్ల కోసం తిరిగిన దృశ్యాలన్నీ కనిపించసాగాయి. అడుగడుగునా రాకాసుల్లాగా ఉండే జెముడు పొదలు కళ్ళముందు మెదిలాయి. ఆశ్చర్యం, ఇప్పుడా కొండలో మచ్చుకు ఒక చెట్టు కూడా కనిపించలేదు. ఉత్తరం వైపు చూశాను. కొమ్మలు నరికేసిన బోడి చెట్టులాగా నిల్చుంది ఊరకొండ. దాని అడుగు భాగం నుంచి పై వరకూ పెద్ద పెద్ద గుండ్లూ, బండలూ వ్యాపించి ఉండేవి. అవి ఇప్పుడు ఒకటీ లేవు. కసాయివాడు జంతువును చంపి ముక్కలు ముక్కలుగా మాంసం కోసి కుప్పలు వేస్తున్నట్లు వడ్డెవాళ్ళు సైజు రాళ్ళను చీల్చివేస్తున్నారు. కొంతమంది ఆ రాళ్ళను లారీల్లో నింపుతున్నారు. అదంతా గమనిస్తుండగానే మా బండ్లపల్లి వచ్చింది. మా బస్సుకు అక్కడ స్టేజీ లేకపోయినా డ్రైవర్ని అడిగి బస్సు దిగాను.

టైమ్ ఏడు గంటలయింది. సూట్‌కేసూ, బ్యాగూ కింద పెట్టి రోడ్డు పక్కన నిల్చుకొని చుట్టూ కలయచూశాను. చిన్నప్పుడు అక్కడ తలంత్రాల కట్టా, దాని పక్కన చిన్న సత్రం ఉండేవి. ఇప్పుడవి రోడ్డు పక్కన పుట్టుకొచ్చిన టీకొట్టులకు వెనకబడి ఉన్నాయి. ఒకపక్క రెండు గాలి మిషన్లూ, మరో పక్క రెండు సెలూన్ షాపులూ వెలిశాయి. ఇరవై ఏళ్ళ తర్వాత మా ఊరికొచ్చిన నాకు రోడ్డు పక్కనున్న ఆ షాపులు కొత్తగా కనిపించసాగాయి. నిజంగా ఇవి మా బండ్లపల్లికి అవసరమా అనిపించింది. వెంటనే అవసరమేనేమో అనుకున్నాను. పరిణామంలో అనవసరాలు కూడా అవసరాలుగా మారక తప్పదు కదా!

టీకొట్ల ముందు మనుషులు పల్చగా ఉన్నారు. వాళ్ళందరూ నావైపు చూస్తున్నారు. కానీ, ఎవరూ నన్ను గుర్తించినట్లు లేదు. నాకు కూడా వాళ్ళెవరో గుర్తుకు రాలేదు. గట్టిగా ఆలోచన చేస్తూ ఊళ్ళోకి బయలుదేరాను. అక్కణ్ణుంచి ఊరు రెండు ఫర్లాంగుల దూరంలో ఉంటుంది. ఎప్పుడో నా పిల్లప్పుడు ఊర్లోకి వేసిన కంకర రోడ్డు పూర్తిగా పాడయిపోయి, పల్లె పతనావస్థకు గుర్తుగా ఉంది. కుడిపక్క కొండ దరిలో గవర్నమెంటు కట్టించిన ఇళ్ళు కావచ్చు, అక్కడక్కడ కనిపిస్తున్నాయి. ఏ ఇంటికీ చెక్క తలుపులు లేవు. తడిక తలుపులు కొన్ని పొగచూరి ఉన్నాయి. కొన్ని చెదలుపట్టి ఉన్నాయి.

ఊర్లో నుంచి ఆవుల మంద ఎదురయింది. పశువులన్నీ బక్కచిక్కి ఉన్నాయి. వెనక వైపున మందను అదిలిస్తూ ఆవుల చెన్నప్ప వస్తున్నాడు. మనిషి బాగా 'దసిలి'నట్లున్నాడు. ఎగాదిగా నావైపు చూస్తున్న చెన్నప్పను నేనే పలకరించి పరిచయం చేసుకున్నాను. అతడు సంతోషపడుతూ మా సంసారాన్నీ గురించి అడిగాడు.

'టక్' చేసుకొని, బూట్లు వేసుకొని 'టక్ టక్'మని నడుస్తున్న నావైపు పిల్లలు ఆశ్చర్యంగా చూస్తున్నారు. వాళ్ళ శరీరాల మీద దరిద్రం తాండవిస్తూ ఉంది.

మా ఇంటి సందు వైపు నడుస్తున్న నన్ను చూసి ఒక ఇంటి ముందు చెట్టు కింద కూర్చున్న ఒక పెద్దాయన "యా ఊర్నాయినా? ఎవురింటికి" అని అడిగాడు. నేను ఆ పెద్దాయనను ఎగాదిగా చూసి పోల్చుకొని, "ఏమి, సంజప్ప మామా, బాగుండావా? నేను తిమ్మప్ప కొడుకు గోపాల్ని", అంటూ పరిచయం చేసుకున్నాను. నా ఊరి ప్రజలతో మాటల్లోకి దిగగానే నా భాష కూడా మారిపోవడం నాకు ఆశ్చర్యం కలిగించింది.

"ఓరి బడవా, ఎన్నాళ్లకొత్తివోయ్? అందురూ బాగుండారో! నా జతగాడు, అదేనప్పా, మీ నాయిన ఎట్లుంటాడు? నీ దెగ్గిర్నే ఉండాడా? అనంతపురంలో ఉండాడా? అతగాడు ఈ మద్దెలో శానాల్లాయె రాక." ప్రేమగా అడిగాడు సంజప్ప కాఫీ తాగి పోదువు రమ్మని పిలిచాడు. నేను రెండు మాటలు మాట్లాడి మళ్ళీ వస్తానని ముందుకు నడిచాను.

వీధిలో మట్టి మిద్దెలన్నీ ఉప్పుదొర్లి శిథిలావస్థలో ఉన్నాయి. నా చిన్నప్పటి కళ ఏ ఇంటి మీదా కని పించలేదు. చాలా ఇళ్ళకు తాళాలు వేసి ఉన్నాయి. కొన్ని ఇళ్ళు కూలిపోయాయి. అంతా గమనిస్తూ, బరువుగా నిట్టూరుస్తూ మా ఇంటి లోగిట్లోకి అడుగుపెట్టాను. ఇంటిని చూడగానే మనసు ఎక్కడో అగాథాల్లోకి కూరుకుపోయింది. పెదవులు ఆరుకుపోయాయి. గుండె బరువయిపోయింది.

ఇంట్లో ఎవరూ ఉన్నట్లు లేదు. తలుపు ముందుకు వేసి ఉంది. ఇంటి పక్కన దొడ్లో చెట్టు కింద ఆడుకుంటున్న ముగ్గురు పిల్లలు నన్ను చూసి ఒకచోటికి చేరుకున్నారు. వాళ్ళ బట్టలన్నీ మాసిపోయి గాలీగాబరగా ఉన్నాయి. జుట్లన్నీ ఎర్రగా పీచురేగి ఉన్నాయి. వాళ్ళల్లో చిన్నోడు చీమిడి కార్చుకుంటూ, అంగీ కొనను నోట్లో పెట్టుకొని నములుతూ నావైపు బిత్తరబిత్తరగా చూస్తున్నాడు.

దగ్గరగా వెళ్ళి "ఎవ్వరి పిల్లర్లా మీరు" అని అడిగాను. రంగన్న కొడుకులమని చెప్పారు వాళ్ళు వింటూనే నా మనసు చివుక్కుమనింది. ఆ ఇంటివైపు చూస్తూ, ఆ పిల్లల వాలకం గమనిస్తూ కాసేపు ఆలోచన చేసి, "నేను మీ పెద నాయన్ను రా. మీ అమ్మా, నాయినా యాటికి బొయినారు?" అంటూ వాళ్ళకు అర్థమయ్యే భాషలోనే అడిగాను. ఏమనుకున్నారో ఏమో వాళ్ళు ముగ్గురూ తూనీ గల్లాగా ఎక్కడికో దౌడు తీశారు. నేను చేతిలో ఉన్న సామాన్లు పక్కనపెట్టి చెట్టు కిందున్న నులక మంచ మ్మీద కూర్చున్నాను. మంచం కోళ్ళు నాలుగూ పుచ్చు పట్టి ఉన్నాయి. విరిగిపోయిన ఒక అడ్డ వట్టెకు దబ్బలేని కట్టారు. అగదాళ్ళన్నీ ముళ్ళు వేశారు. మంచం నులకంతా పీచులు పీచులయింది. అంతా గమనిస్తూ జాగ్రత్తగా కూర్చొని పరిసరాలన్నీ చూడసాగాను.

ఏ దొడ్డిలోనూ బారెడు గడ్డివామి లేదు. ప్రతి దొడ్డి చుట్టూ ఉన్న ముళ్ళ కంచెలూ, తెట్టు గోడలూ శిథిలావస్థలో ఉన్నాయి. ఆ మట్టి మిద్దెలనూ, చెదలు పట్టిన కొట్టాలనూ, నగం కూలిన ఇళ్ళనూ, గాలీగాబరగా ఉన్న నందులనూ, బక్కచిక్కిన పశువులనూ, అన్నీ తలచుకొని విచ్ఛిన్నమైపోతున్న గ్రామీణ జీవితాన్ని గురించి ఆలోచిస్తున్నాను. అంతలోనే ఒక ఆడమనిషి పిల్లల్ని వెంటబెట్టుకొని వస్తూ, నన్ను చూసి పైటకొంగు నిండుగా కప్పుకుంటూ దగ్గరికొచ్చి "ఎప్పుడొచ్చినారు బావా? అందురూ బాగుండారా" అని అడిగింది. ఆమెను పోల్చుకున్నాను. నా చిన్న తమ్ముని భార్య నాగమ్మ. ఇంతకు ముందు చూసినప్పుడు దిండుగా కళకళలాడుతూ ఉండేది. పదీ పన్నెండు సంవత్సరాలలోనే ఆమె ముఖంలో వృద్ధాప్యపు ఛాయలు కనిపించడం నాకు ఆశ్చర్యమనిపించింది.

పేదరికం మనిషిలోని అందచందాలనే కాదు, వయసును కూడా హరించివేస్తుందేమో! ఎవరికయినా దారిద్ర్యం వంటి వేదనాభరితమయినది మరొకటి ఉండదేమో! నాలో నేను మాట్లాడుకుంటూ ఆమెను పలకరించాను. "రంగన్న ఎక్కడికి పోయినాడమ్మా" అని అడిగాను. అడుగుతూ ఉండగానే రంగన్న వచ్చాడు. నిండుగా నవ్వుతూ పలకరించాడు. మనిషి బాగా చిక్కిపోయి కట్టెపుల్లలాగా ఉన్నాడు. వాణ్ణి చూడగానే నా తమ్ముడేనా అనుకున్నాను. పట్టీల డ్రాయర్ మీద ముతక బనియన్ వేసుకొన్నాడు. భుజమ్మీదున్న 'టువ్వాలు' నల్లగా మాసిపోయి అగ్గిలో వేస్తే కూడా కాలనంటూ ఉంది. వాడొక కదలాడే అస్థిపంజరంలా ఉన్నాడు. వాళ్ళందర్నీ చూస్తున్న నాలో జీవనాడులన్నీ తెగిపోతున్నట్లు అనిపించింది.

వాళ్ళ వెనక మౌనంగా ఇంట్లోకెళ్ళాను. వెళ్ళగానే గాటిపాడు 'గంజు'వాసన గుప్పుమనింది. ఒకప్పుడు అక్కడే పుట్టిపెరిగిన ప్రాణం ఆ వాసనను ఇప్పుడు భరించనంటూ ఉంది. దీన్ని ఏమనాలో నాకర్థం కాలేదు. ఇల్లంతా కలయజూశాను. అదే గాటిపాడు. అదే జెగిలి. అవే వంకరటింకర స్తంభాలు. జెగిలి మీద ఒక పక్క పొంతా పొయ్యీ, కొంచెం ఎడంగా ఖాళీగా ఉన్న రెండు "ఉట్లు" వేలాడుతున్నాయి. తల పైకెత్తి చూశాను. పైన ఒక దూలం వంగి ఉంది. అది కింద పడకుండా రెండు సరుగుడు నగలను 'పోటీ' పెట్టారు.

మరదలు నాగమ్మ బకెట్లో నీళ్ళు తోడి బయట జలాటిబండ దగ్గర పెట్టింది. నేను బ్రెష్ మీద పేస్టు వేసుకొని బయటికి వెళ్ళి పళ్ళు తోముకోసాగాను. పిల్లలు నా నోటి వైపూ, బ్రష్ వైపూ వింతగా చూడసాగారు. నేను ముఖం కడుక్కునేలోగానే నాగమ్మ ఎక్కడికో వెళ్ళి కొంగులో ఏదో దాచుకొని వచ్చింది. ఆమె తెచ్చింది కాఫీపొడీ, బెల్లం అయివుంటాయనుకున్నాను. తమ్ముడు గ్లాసులో పాలు తెచ్చింది, తాను దాచుకోలేకపోయాడు. ఆ ఇంట్లో అడుగడుగునా తాండవిస్తున్న పేదరికం దాచేస్తే దాగని సత్యం. దాన్ని దాచిపెట్టి నాకు మర్యాద చేయడానికి ఆ ఇల్లాలు పడిన తాపత్రయాన్ని మహాకవి కూడా చిత్రించలేడేమో!

నాగమ్మ పొయి మీద కాఫీకి పెట్టి పాత్రలో బెల్లం వేసింది. నాకు బెల్లం కాఫీ అలవాటు లేదని ఆ సమయంలో ఆమెకు ఎలా చెప్పాలో నాకు అర్థం కాలేదు. చెప్పి ఆమె మనసును నొప్పించడం కంటే ఆమె ఏదిచ్చినా దాన్ని తాగడమే మంచిదనుకున్నాను. మరదలు పెద్ద గ్లాసు నిండా కాఫీ పోసి ఇచ్చింది. అంత తాగలేనని కొంత వేరే గ్లాసులోకి పోసి మిగతాది కష్టపడి తాగాను. కాఫీ మర్యాద అయ్యాక బ్యాగులో నుంచి స్వీట్లూ, పండ్లూ, రెండు జతల బట్టలూ అన్నీ తీసి కంబడి మీద పెట్టాను. పిల్లలు దూరంగా కూర్చొని గుడ్లప్పగించి నావైపూ, ఆ వస్తువుల వైపూ చూస్తున్నారు. నేను వాళ్ళను దగ్గరికి పిలిచి ఆ ప్యాకెట్లను వాళ్ళ చేతికిచ్చాను. అవి తీసుకుంటున్న వాళ్ళ కళ్ళల్లోని కాంతిని చూసి ఆనందమయింది. జెగిలి మీద ఒక పక్క గోడకు ఆనుకొని నిల్చున్న మరదల్ని గమనించాను. కారుతున్న కన్నీళ్ళను చీరకొంగుతో తుడుచుకుంటూ ఉందామె. ఆ కన్నీళ్ళ వెనక దాగి ఉన్న ఆ ఇల్లాలి వేదనేమిటో నా గుండెల్ని తాకింది.

చిన్న బావతో పాటు తాము కూడా టౌను

> పెద తమ్ముడి పిల్లలు
> పరాయివాళ్ళుగా ఉంటే
> రంగన్న పిల్లలు
> మనసులో మెదిలారు.
> వెంటనే నా కాళ్ళు
> [illegible]
> నడవసాగాయి.

చేరుకొని ఉంటే తమ బతుకు ఇంత అధ్వానంగా ఉండేది కాదని ఆమె కన్నీళ్ళకు అర్థం. అయితే నేనే నా ఉత్తరాల్లో, పొలం అమ్ముకొని టౌనుకు పోవద్దని, భూమిని నమ్ముకున్నవాడు ఎప్పుడూ చెడిపోడని రాస్తూ రంగన్నను టౌనుకు చేరకుండా ఆపాను. బహుశా నేను చేసింది పొరపాటేనేమో! పొలాన్ని నమ్ముకున్నందువల్లనే వాళ్ళ సంసారం ఆ విధంగా చిదిగిపోయిందనుకుంటాను.

తమ్ముని వైపు చూస్తూ పొలాలూ, పంటల విషయం అడిగాను. అంతే. మరదలి దుఃఖం ఒక్కసారిగా కట్టలు తెంచుకుంది. లోపలున్న వేదనంతా కక్కేసింది.

"రాక రాక ఈ ఏడు చెర్లోకి నీళ్ళు ఒకరకంగా వొచ్చినాయి. ఊర్లో పార్టీ పెట్టుకొని ఐకమత్యం లేక పంట పెట్టలేదు. పనుల్లేక ఏడుకేడుకు మొగోళ్ళందురూ ఒళ్ళార్చుకుంటా ఉండారు. సులకాగ దుడ్లు సంపాయిచ్చల్లనుకుంటా ఉండారు. మాగాణి దున్ని ఒళ్ళంతా మన్ను పూసుకొని పనులు చేసేవాళ్ళే తక్కువయిపోయినారు. నాలుగేండ్ల తర్వాత పోయిన సమ్మత్సరం శెనిక్కాయి పంట బాగనే చేతికొస్తాదనుకుంటే సున్నగ తెగులొచ్చి నాశనమయిపాయ. అందుకే ఒగొగరు ఊరొదిలి అనంతపురం చేరుకొని లక్షణంగా బతుకుతా ఉండారు. ఈయన మాత్రం పండని ఈ వ్యవసాయాన్ని నమ్ముకొని పిల్లల బతుకును నాశనం చేస్తా ఉండాడు."

మరదలు వాపోయింది. నేనామెను ఓదార్చాను. అనంతపురం వెళ్ళి చూసిన తర్వాత ఏమి చెయ్యాలో చెబుతానన్నాను. తర్వాత తమ్ముణ్ణి వెంటబెట్టుకొని మా పొలం దగ్గరికెళ్ళాను. నా చిన్నప్పుడు మాకు బతుకునిచ్చిన నేలతల్లి పిచ్చి మొక్కలతో, చింపిరి జుట్టు వేసుకున్న అనాథలాగా కనిపించింది. చూసి భరించలేకపోయాను. మొత్తం కనుచూపు మేర వరకూ ఉన్న మాగాణీ బీడుగానే ఉంది.

ఇరవై ఏళ్ళ కిందట మా చెరువు కింద గుత్తకు చేసుకోడానికి కూడా రెండెకరాల మడి దొరికేది కాదు. ఎన్నో కండిషన్ల మీద ఆసాములు భూమిని గుత్తకిచ్చేవాళ్ళు. ఇంక మెట్ట పొలమయితే అసలే దొరికేది కాదు. అలాంటిది ఎంత మార్పు చెందింది? ఆ దరిదాపుల్లో పల్లెల పరిస్థితి అంతా అదే మాదిరి ఉందని తమ్ముడు చెబుతూ ఉంటే వినడం నా వంతయింది.

బరువుగా నిట్టూరుస్తూ తమ్ముని వెనక ఊర్లో కొచ్చాను. నా చిన్నప్పుడు మా కుటుంబంతో సన్నిహితంగా ఉన్నవాళ్ళ ఇళ్ళకెళ్ళి అందరినీ పలకరిద్దామనుకున్నాను. మూడు నాలుగు కుటుంబాలు తప్ప అన్నీ ఊరొదిలాయని తెలిసి మౌనంగా ఇంటికొచ్చి సూట్‌కేస్ సర్దుకోసాగాను. అన్నం చేస్తాను, తిని పొమ్మనింది మరదలు. తమ్ముడు ఆమెకు వంత పలికాడు. నిజానికి అప్పటికింకా పొయ్యి అంటించలేదు. పాపం, మాట వరసకు అలా అన్నారు కానీ, రాక రాక వచ్చిన నాకు పప్పో, చారో, మరొకటో చేసి పెట్టాలనుకున్న వాళ్ళకు ఇబ్బందిగానే ఉంటుందని నాకు తెలుసు. అందుకే వాళ్ళకు నచ్చజెప్పి ఒక వెయ్యి రూపాయలు మరదలి చేతిలో పెట్టి బయలుదేరాను. చేతికిచ్చిన డబ్బును తీసుకోడానికి ఇష్టం లేకా, వద్దనడానికి మనసు రాకా పొంగి వస్తున్న దుఃఖాన్ని ఆపుకోవడానికి ఆ ఇల్లాలు పడిన వేదన నా గుండెల్ని చీల్చివేసింది.

అంతకంటే ఏమి చేయాలో నాకప్పుడు అర్థం కాలేదు. నా వాటా కింద వచ్చిన భూమినంతా తమ్ముళ్ళిద్దరికీ చెరి నగం ఎప్పుడో రాసిచ్చాను. దానికి మొదట మా ఆవిడ అడ్డం చెప్పినా, చివరికి వాళ్ళ పరిస్థితిని అర్థం చేసుకొని సరేనంది. అమ్మా నాన్నలకని ప్రతి నెలా వెయ్యి రూపాయలు పంపుతూనే ఉన్నాను. మరి అంతకంటే నేనేమి చేయగలను?

నన్ను నేను సమాధానపరచుకుంటూ ఆమెను ఓదార్చి బయలుదేరి అనంతపురం బస్సెక్కాను. శివపురం, కొర్రపాడూ, రోటరీపురం, బుక్కరాయ సముద్రం ఒకదాని తర్వాత ఒకటి ఎదురయ్యాయి. టౌనుకు దూరంగా ఉన్న పల్లెల కంటే దగ్గరగా ఉన్న పల్లెలు కళకళగా కనిపించాయి. బుక్కరాయ సముద్రం బాగా పెరిగినట్టుంది. మండలం ఆఫీసులూ, కరెంటు సబ్ స్టేషనూ, హైస్కూలూ, వ్యవసాయ గిడ్డంగులూ, అంగళ్ళూ హోటళ్ళూ రోడ్డు పక్కనంతా వ్యాపించాయి. అన్నీ గమనిస్తూ అనంతపురం చేరుకున్నాను.

బస్సు దిగుతూ బస్టాండునూ, చుట్టూ పైకి లేచిన బిల్డింగులనూ, రోడ్లనూ, అనూహ్యంగా పెరిగిన ట్రాఫిక్కునూ గమనించాను. కొన్ని భవనాలు ఆకాశంలోకి చొచ్చుకుపోతున్నాయి. పెద్ద పెద్ద హోటళ్ళూ, కొత్తగా వెలసిన ప్రయివేట్ నర్సింగ్ హోములూ, హాస్పిటల్స్, షాపింగ్ కాంప్లెక్స్‌లూ, కంప్యూటర్ సెంటర్లూ ఒకటేమిటి– మొత్తం టౌను దర్జాగా ఉంది. రాష్ట్రంలో చాలా వెనకబడిన ప్రాంతానికి చెందిన మా అనంతపురమేనా ఇది అని అనుకున్నాను. అన్నీ గమనిస్తూ ఆశ్చర్యపోతూ గంగన్న ఇంటికి బయలుదేరాను.

గంగన్న నా పెద్ద తమ్ముడు. వాడు అయిదారేళ్ళ కిందట బండ్లపల్లి వదలి అనంతపురం చేరుకు




న్నాడు. అప్పుడప్పుడు ఉత్తరాలు రాస్తూ తాను ఈ మధ్యలోనే రామ్‌నగర్ చివర స్థలం తీసుకొని ఇల్లు కట్టుకున్నానని గుర్తులు తెలుపుతూ క్లియర్‌గా అడ్రస్ కూడా రాశాడు. మచిలీపట్నం వెళ్ళకముందు మేము కూడా రామ్‌నగర్లో ఉండేవాళ్ళం. అందువల్ల వాడు ఎక్కడ ఇల్లు కట్టుకున్నదీ నేను మనసులో ఊహించుకున్నాను. రామ్‌నగర్లో ఒక ప్రయివేట్ స్కూల్లో నేనూ, పక్కనే ఉన్న రుద్రం పేటలో నా భార్యా పని చేస్తూ అనంతపురం చేరేనాటికి మా తల్లితండ్రులూ, తమ్ముళ్ళూ ఇంకా పల్లెలోనే ఉండేవాళ్ళు.

ఆటోవానికి గుర్తులు చెప్పాను. ఆటో రామ్‌నగర్ రైల్వే గేటు దాటి దాదాపు బైపాస్ రోడ్డు దాకా వెళ్ళింది. నా మనసులో ఉన్న గుర్తులు అక్కడెక్కడా కనిపించలేదు. మొత్తం బైపాస్ వరకూ బ్రహ్మాండ మయిన బిల్డింగులు పైకి లేచాయి. రోడ్డంతా చాలా రద్దీగా ఉంది. వందలాది ఆటోలూ, కార్లూ, ట్రాక్టర్లూ, లారీలూ, బస్సులూ తిరుగుతున్నాయి. బైపాస్ దాకా రోడ్డుకిరువైపులా లెక్కలేనన్ని రకరకాల దుకాణాలు పుట్టుకొచ్చాయి. వాటి వెనక చిన్నా పెద్దా వేలాది బిల్డింగులు కనిపిస్తున్నాయి. వాటి మధ్యలో నా తమ్ముని ఇల్లు ఎక్కడుందో నాకు దిక్కు తోచలేదు. ఆటోను నిలిపి ఒక టీకొట్టులో అడిగాను. అతడు లోపలి వైపునకు చేయి చూపుతూ "ఇదిగో, ఆ ఇల్లే" అన్నాడు. ఆటో నేరుగా వెళ్ళి ఆ ఇంటి దగ్గర ఆగింది. ఆటో దిగి ఇంటిని చూసి ఆశ్చర్యపోతూ కాలింగ్ బెల్లు నొక్కాను. వెంటనే "ఎవరూ" అంటూ వాకిలి తీసి, నన్ను చూసి సంతోషపడుతూ నా చేతుల్లోని బ్యాగులు తన చేతిలోకి తీసుకొని సాదరంగా లోనికి ఆహ్వానించాడు. ఇంట్లోకి అడుగు పెట్టగానే మరదలు సుబ్బమ్మ తృప్తిగా పలకరించి నా భార్యాపిల్లలను గురించి అడిగింది. భార్యాభర్త లిద్దరూ శుభ్రంగా నిగనిగలాడుతున్నారు. తమ్ముని ఒంటి మీద ఖరీదయిన ఖద్దరు జరీ అంచు పంచె, పాలిస్టర్ షర్టూ తెల్లగా మెరుస్తున్నాయి. మరదలు కాఫీ పొడి రంగు గద్వాల చీర కట్టుకుంది. మెడలో బంగారు పురి చైనూ, చేతుల్లో బంగారు ఫ్యాషన్ గాజులూ మెరుస్తున్నాయి.

ఇల్లంతా కలియజూశాను. ఆరు గదులతో చక్కగా ఉంది. అన్ని గదుల్లోనూ ఫ్యాన్లు, హాల్లో ఒక పక్క ఎయిర్ కూలర్, మరొక పక్క ఫ్రిజ్, గోడవార సోఫాసెట్ చూస్తూ నమ్మలేకపోయాను. అయితే, అవన్నీ నిజం.

వెనక వైపున దొడ్లో పట్టె మంచం మీద కూర్చొని మరొక పెద్దాయనతో కబుర్లు చెప్పుకుంటున్న అమ్మా నాన్నలను చూసి ఆనందమైంది. ఇద్దరూ హాయిగా ఆరోగ్యంగా ఉన్నారు. పిల్లలూ, కమలా నాతో పాటు రానందుకు అందరూ కాసేపు బాధపడ్డారు.

నేను బాత్‌రూముకు వెళ్ళి వచ్చేలోగా మరదలు చిక్కటి బ్రూ కాఫీ ఇచ్చింది. ఆ రుచిని చవిచూసి ఇంకొంచెం తాగాలనిపించింది. అమ్మానాన్నల దగ్గర కూర్చొని మాటల్లోకి దిగాను. తమ్ముడు పక్కనే కూర్చున్నాడు. నేను తమ్ముని పిల్లలను గురించి అడుగుతుండగనే పిల్లలు తూనీగల్లాగా వచ్చారు. ముద్దుముద్దుగా బొద్దుగా ఉన్నారు. వాళ్ళ కళ్ళల్లో సంతృప్తి కళ నిగనిగలాడుతూ ఉంది. వాళ్ళను దగ్గరికి పిల్చి అక్కున చేర్చుకొని వాళ్ళ చదువులను గురించి ఆరా తీశాను. అన్నను మించి చెల్లెలూ, చెల్లెల్ని మించి అన్నా చాకుల్లాగా కనిపించారు.

వాళ్ళను పరామర్శిస్తూ ఉంటే రంగన్న పిల్లలు మనసులో మెదిలారు. వెంటనే నా చూపులు కాసేపు ఎక్కడో చూడసాగాయి.

మేము అవీ ఇవీ మాట్లాడుతుండగనే మరదలు సుబ్బమ్మ వంట రెడీ చేసి, డైనింగ్ టేబుల్ మీద వడ్డించి అందర్నీ భోజనానికి పిలిచింది. డైనింగ్ టేబుల్ని చూసి నాకు ఆశ్చర్య మేసింది. ప్లేట్స్‌లో నైస్‌గా తెల్లగా ఉన్న అన్నం, పక్కన రెండు రకాల కూరలు, నంజుకోడానికి వడియాలూ, అప్పడాలూ, ఊరగాయా, చిన్న గిన్నెలో నెయ్యీ, చారూ, మజ్జిగా- అన్నీ చూసి, 'ఇది నా తమ్ముని ఇల్లేనా' అనుకున్నాను.

భోజనాలయ్యాక కాసేపు పల్లె సంగతులూ, వ్యవసాయ సంగతులూ మాట్లాడుకున్నాం. చిన్న తమ్ముని సంసార సంగతులు తలచుకొని బాధ పడ్డాం. చెల్లెండ్రు నలుగురూ వాళ్ళ ఊరొదిలి రుద్రం పేట పక్కన కొత్తగా కట్టిన కాలనీలో చేరారనీ, అందరూ హాయిగా ఉన్నారని గంగన్న చెబుతూ ఉంటే సంతోషమయింది.

సాయంకాలం తమ్మునితో కలిసి కాలనీలోకి వెళ్ళాను. బైపాస్ పక్కనున్న రుద్రంపేట టౌన్లో కలిసిపోయింది. ఇరవై ఏళ్ళ కిందట చీకటి పడగానే రామ్‌నగర్ నుండి రుద్రంపేటకు వెళ్ళడానికి జనం భయపడేవాళ్ళు. రామ్‌నగర్ దాటిన తర్వాత విపరీతమయిన కంప మొక్కలతో ఆ ప్రాంతమంతా నిర్మానుష్యంగా ఉండేది.

బైపాస్ సర్కిల్ బ్రహ్మాండమయిన రద్దీతో కూడి ఉంది. క్రాసింగ్ నాలుగు వైపులా లెక్కలేనన్ని షాపులు జనంతో కిటకిటలాడుతున్నాయి. మాటల సందర్భంలో అక్కడ సెంటు నేల రెండు లక్షలని తమ్ముడు చెప్పేసరికి నేను ఆశ్చర్యపోయాను. ఇరవై ఏళ్ళ కిందట ఆ ప్రాంతమంతా ఎలాగుండేదీ మాట్లాడుకుంటూ ఇద్దరమూ కాలనీ దగ్గరి కెళ్ళాం.

రోడ్డు మీద నిల్చుకొని కొంచెం 'తగ్గు'లో ఉన్న కాలనీ వైపు తేరిపారజూశాను. కనుచూపు మేర వరకూ ఇళ్ళే చిన్న చిన్న మిద్దెలూ, పెంకుల కొట్టాలూ, అక్కడక్కడ ఎత్తుగా ఉన్న బిల్డింగులూ కనిపిస్తున్నాయి. వచ్చే పోయే ఆటోలతో, జనంతో



కాలనీ రద్దీగా ఉంది. కాలనీ ముందు భాగంలో ఇరవై ముప్ఫై హోటళ్ళూ, టీబంకులూ, సెలూన్లూ, కూరగాయల అంగళ్ళూ చూసి నేను నమ్మలేకపోయాను. అక్కడ దాదాపు మూడు వేల ఇళ్ళున్నాయని, కాలనీ లోపల కూడా సెంటు నేల ఇరవై వేలనీ తమ్ముడు చెబుతూ ఉంటే నోరెళ్ళబెట్టడం నా వంతయింది. కొన్ని టీబంకుల్నీ, కూరగాయల అంగళ్ళనూ చూపి అవన్నీ మన బండ్లపల్లి వాళ్ళవేనని గంగన్న చెప్పాడు. వాళ్ళు దినానికి కనీసమంటే రెండు మూడు వందలు మిగిలించుకుంటారని, చాలా మంది వడ్డీ వ్యాపారం చేసుకుంటున్నారని చెబుతూ ఒక చిన్న హోటల్ దగ్గరికి నన్ను తీసుకొనిపోయాడు. ఎదురుగా పూరీలు చేస్తున్న ఆడమనిషిని చూసి నవ్వుతూనే ఆశ్చర్య పోయాను. ఆమె నా పెద్ద చెల్లెలు రామక్క. ఆమె భర్త నూరన్న కస్టమర్స్‌కు టిఫిన్ సప్లయి చేస్తున్నాడు. ఇద్దరు పిల్లనాయాళ్ళు ప్లేట్లు కడుగుతున్నారు.

నన్ను చూడగానే చెల్లెలూ, బావా ఆనంద పడిపోయారు. అక్కడ కాసేపు కూర్చొని కాఫీ తాగి, వరసగా అందరి ఇళ్ళకూ వెళ్ళాను. రెండో చెల్లెలు ఎనుములు పెట్టుకొని లక్షణంగా ఉంది. మూడో చెల్లెలు కూరగాయల అంగడి పెట్టుకుంది. నాలుగో చెల్లెలు వాళ్ళ ఊర్లో వాళ్ళ భాగానికొచ్చిన వ్యవసాయ భూమిని అమ్మేసి వచ్చి, ఆ కాలనీలో మంచి ఇల్లు కట్టుకొని, మిగిలిన 'లెక్క'ను వడ్డీలకు తిప్పుతూ చేతినిండా డబ్బు పెట్టుకుంది. తల్లితండ్రులూ, చెల్లెండ్రూ, తమ్ముడూ సుఖంగా ఉండడం తలచుకొని సంతోషపడుతూ తమ్ముని ఇంటికి బయలుదేరాను. తమ్ముడు చెల్లెళ్ళందరినీ రాత్రి తనింటికి భోజనానికి ఆహ్వానించాడు.

తమ్ముని వెంట కాలనీ నుంచి వస్తున్నాను. పొద్దు మునుగుతూ ఉంది. రోడ్డు వెంబడి గుంపులు గుంపులుగా పిల్లాపిసుకూ, ముసలీముతకా ఆనందంగా ఒకరినొకరు గిచ్చుకుంటూ గిల్లుకుంటూ పరాచకాలాడు కుంటూ వస్తున్నారు. వాళ్ళ చేతుల్లో ఖాళీ క్యారియర్లు ఊగుతున్నాయి. వాళ్ళ ముఖాల్లో తృప్తి తొణికిసలాడుతూ ఉంది. వాళ్ళందరూ టౌన్లో బేల్దారీ పనికి వెళ్ళొస్తున్నారని, అందరూ కాలనీ వాళ్ళేనని, నీడపాటున పని చేస్తూ రోజుకు మూడు నాలుగుసార్లు కాంట్రాక్టర్లు సప్లయి చేసే టీలూ, కాఫీలూ తాగుతూ సాయంకాలానికి యాభై నుండి నూర్రుపాయల దాకా కూలి తీసుకొని పోతారని, పని చేసే ఓపిక ఉంటే సంవత్సరం పొడవునా పని ఉంటుందని తమ్ముడు చెబుతూ ఉంటే ఒక వైపు సంతోషించాను గానీ, మరోవైపు అసంతృప్తి నాలో పేరుకుపోయింది.

పల్లె నుంచి చిన్న తమ్ముడూ, వాని భార్యా వచ్చారు. వాళ్ళతో పాటు మరికొంత మంది కులస్థులొచ్చారు. వాళ్ళ వేషాలు చూసి నా మనసు చివుక్కుమనింది.

ఇలాంటి కాలనీలు టౌన్లో ఎన్నో ఉన్నాయట! పల్లెలు వదలి వేలాది కుటుంబాలు టౌన్లకు చేరుతున్నాయట! విలాసవంతంగా బతక్కపోయినా తినడానికి కరువు లేదట! నిజమే, ఇలాగే వ్యవసాయ కూలీలూ, రైతులూ వ్యవసాయాన్ని వదిలేసి పట్నాలకు చేరిపోతే భవిష్యత్తులో ఏర్పడే తిండిగింజల లోటును వీళ్ళ కూలిడబ్బులు తీర్చుకోగలవా? పడిపోయే డబ్బు విలువల వెంట వీళ్ళ కష్టార్జితం పరువెత్తగలదా?

ఆలోచిస్తూ ఇల్లు చేరుకున్నాను. రాత్రి భార్యాపిల్లలతో భావమరదులందరూ తమ్మునింటికొచ్చారు. అందరితోనూ ఇల్లంతా పండిన వరిమడిలాగా గలగలమంటూ కళకళలాడుతూ ఉంది. భోజనాలయ్యాక అందరమూ ఒక చోట కూర్చున్నాం. పల్లెలోని వ్యవసాయమూ, అనుభవించిన పేదరికమూ, టౌన్లో చేరిన తర్వాత బాగుపడిన వైనమూ- అన్నీ చర్చించుకున్నాం. చిన్న బావ వెంకటేశు తమ పల్లెలో కక్షలతో, కార్పణ్యాలతో తమ కుటుంబం ఎలా చిదిగిపోయినదీ వివరించాడు. "ఆడ ఎవుడూ పిడికెడన్నం పెట్టకపోయినా, పెద్దోల్లందరికీ అనిగి మనిగి ఉండల్ల. ఈడ ఎవురడగల్ల? ఎవుని బతుకు వానిది. తెలివుండే వారు ఎంతయినా సంపాయిచ్చు కోవచ్చు. కోరింది తెచ్చుకొని తినొచ్చు. పిల్లల్ని సదివిచ్చుకోవచ్చు. మూతి నచ్చినా ముక్కు నచ్చినా ఎంటనే డాక్టర్ దెగ్గిరికి పోవచ్చు."

వెంకటేశు చెప్పిన మాటల్లో అసత్యమయితే నాకేదీ కనిపించలేదు. అయితే, అతని మాటలు నాలో ఎన్నో ప్రశ్నల్ని రేకెత్తించాయి.

దేశంలో ఎనభై శాతం మంది గ్రామాల్లోనే జీవిస్తున్నారు. పల్లెలు సుభిక్షంగా ఉన్నప్పుడే దేశం సుభిక్షంగా ఉంటుంది. ఇక్కడ పల్లెలు చిదిగిపోతూ పట్టణాలు కళకళలాడుతున్నాయి. ఈ పట్టణ వైభవం చివరికి ఎక్కడికి దారి తీస్తుంది? పట్టణాలు పెరుగుతూ కొంత మందికి జీవనోపాధి కల్పించవచ్చును గానీ, నిజంగా ఇది అభివృద్ధి అనిపించుకుంటుందా? ఈ పట్టణీకరణను ఏమనాలి? ఈ పరిణామం తప్పదా?

జవాబులు లేని ప్రశ్నలతో రాత్రంతా గడిచిపోయింది.

ఉదయమే అందరమూ రామ్మూర్తి కూతురి పెళ్ళికి కళ్యాణ మండపానికి బయలుదేరాం. వాడు మాకు బంధువు కావడంతో మా వాళ్ళందరూ పెళ్ళికి వచ్చారు. బహుశా అందరినీ పెళ్ళికి పిలిచినట్లుంది. చెల్లెళ్ళందరూ మంచి మంచి పట్టు చీరలు కట్టుకొని ముస్తాబై వచ్చారు. వాళ్ళ ఒంటి మీదున్న దుస్తులూ, నగలూ వాళ్ళ జీవనగతిని పట్టి చూపుతున్నాయి.

అందరూ ఆనందోత్సాహాలతో కళ్యాణ మండపం చేరుకుంటుండగనే పల్లె నుంచి చిన్న తమ్ముడూ, వాని భార్యా వచ్చారు. వాళ్ళతో పాటు మరికొంత మంది కులస్థులొచ్చారు. వాళ్ళ వేషాలు చూసి నా మనసు చివుక్కుమనింది.

పెళ్ళయిపోయింది.

మళ్ళీ అందరూ ఒక చోట కలిశారు. అక్కడ కళకళలాడుతున్న పట్టణ జీవితం ముందు వెలవెలబోతున్న గ్రామీణ జీవిత దైన్యాన్ని కళ్ళారా చూశాను. గుండె నిండా బరువు చోటు చేసుకుంది. పల్లెల శ్రమశక్తిని తింటూ, గ్రామీణుల అమాయకత్వంతో అధికార పీఠమెక్కుతూ, చివరికి గ్రామ జీవితం పట్ల సవతి ప్రేమను ఒలకబోస్తున్న ప్రభుత్వాలను తలచుకొని కలత చెందిన మనసుతో అందరి దగ్గరా సెలవు తీసుకొని మచిలీపట్నం బయలుదేరాను. ■